క్లుప్తంగా

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అబ్రహం లింకన్



పాన్‌గల్: మండలంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అబ్రహంలింకన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణరెడ్డి సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో జిల్లా కేంద్రం ఆర్డీఓ కార్యాలయంలో డీటీగా విధులు నిర్వహిస్తున్న అబ్రహం లింకన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మండలంలో అందుబాటులో ఉంటూ సిబ్బంది తోడ్పాటుతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ధర్నాకు తరలిన కార్మికులు



పాన్‌గల్: సమస్యల పరిష్కారం కోసం జీపీ కార్మికుల యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషన్ కార్యాలయం ఎదుట ధర్నాకు శుక్రవారం మండలం నుంచి జీపీ కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశ రాము మాట్లాడారు. హైదరాబాద్‌కు తరలివెళ్లిన వారిలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, నాగన్న, సుగ్రీవుడు, రంగస్వామి, శివరాజు, మండల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బీటీ నిర్మాణానికి రూ.3.90 కోట్లు మంజూరు

వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి బెక్కెం గ్రామానికి వెళ్లేందుకు రూ.3.90 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు మంత్రి జూపల్లి కృష్ణారావు సీఆర్ఆర్ నిధులు మంజూరు చేయించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బెక్కెం గ్రామానికి రోడ్డు నిర్మిస్తే చిన్నంబావి మండలంలోని వెలగొండ, మియాపూర్, బెక్కెం, నెలబిల్క్, పైబిల్క్, గడ్డబస్వాపురం, బీమ్లానాయక్ తండా తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. మంత్రికి కాంగ్రెస్ మండల అధ్యక్షులు బీరయ్యయాదవ్, మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు ఎత్తం కృష్ణయ్య, కాంగ్రెస్ నాయకులు గోపి, రవీందర్‌రెడ్డి, కావలి మహేష్, భరత్‌రెడ్డి, ముంతరాజు కృతజ్ఞతలు తెలిపారు.

మోదీ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం

అమరచింత: దేశ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టుపెడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను, ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని, యువత ఉద్యమానికి సన్నద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏఐవైఎఫ్ నాయకులతో కలిసి అమెరికా రాయభార కార్యాలయం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వత్తాసు పలుకుతూ దేశ ప్రతిష్టతను, సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే విధంగా మోదీ చర్యలు ఉన్నాయని ఆరోపించారు. మైబు, ఉదయ్, చేతన్, ప్రణీత్‌లు పాల్గొన్నారు.

పల్లెల్లో మొహర్రం సందడి

అమరచింత: మొహర్రం నెల పురస్కరించుకుని గ్రామాల్లో పీర్ల పండుగ మొదలైంది. శుక్రవారం గ్రామాల్లోని పీర్లచావిడిలో పీర్ల పెట్టెలను భక్తిశ్రద్ధలతో ప్రార్థించి కిందకు దించారు. పట్టణంలోని పెద్దపీర్ల మసీదులో ముజావర్లు గ్రామ పెద్దల సమక్షంలో పెట్టెలను కిందకు దించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శనివారం నుంచి పీర్ల చావిడిలో ఆలంను కూర్చోబెట్టి పది రోజుల పాటు పీర్ల పండుగ నిర్వహిస్తారని ముజావర్లు తెలిపారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

కొత్తకోట రూరల్: ప్రజాపాలనలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను పాదర్శకంగా చేపట్టి ఎంపిక చేయడం జరిగిందని, ఇళ్లు రాని వారు నిరుత్సాహ పడొద్దని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌జె.బోయేజ్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణం కోసం ముగ్గుపోసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

డీఐఈఓకు సన్మానం



వనపర్తి విద్యాభాగం: రాష్ట్ర ఇంటర్ బోర్డు అధికారులు ఇచ్చిన ఆదేశానుసారం ఎప్పటికప్పుడు అమలు చేస్తూ తన విధులను నిర్వహిస్తున్న వనపర్తి డీఐఈఓ ఎర్ర అంజయ్యను ఉత్తమ డీఐఈఓగా ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయమని జిల్లా ఇంటర్ లెక్చరర్స్, అధికారులు అన్నారు. ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య వనపర్తి డీఐఈఓ ఎర్ర అంజయ్యను బెస్ట్ డీఐఈఓను గుర్తించి అభినందించారు.

పొంచి ఉన్న ప్రమాదం

- వర్షాకాలంలో విద్యుత్ తీగలతో జాగ్రత్త
- ఇనుప స్తంభాలకు విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం
- జాగ్రత్తలతో ప్రమాదాల నుంచి రక్షణ
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన గేదె(ఫైల్)

చిన్నంబావి: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నాయని, విద్యుత్ ఘాతానికి గురికాకుండా, విద్యుత్ విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ఉండాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. చిన్నపాటి జాగ్రత్తలతో ప్రమాదాల బారిన పడకుండా ఉండొచ్చని విద్యుత్ అధికారులు పేర్కొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే సురక్షితం

- విద్యుత్ మీటర్లు, స్విచ్ బోర్డులు, బల్బులు వర్షానికి తడవకుండా చూసుకోవాలి. ఇంట్లో కరెంట్ వైరింగ్‌కు ఎర్త్ ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి.
- దుస్తులు ఆరవేయడానికి ఇనుప తీగలు ఉపయోగించొద్దు.
- తడి చేతులతో విద్యుత్ సరఫరా అయ్యే పరికారాలు, హోల్డర్లు, సర్వీస్ వైర్లు, స్విచ్‌లు తాకకూడదు. పిల్లలకు అందనంత ఎత్తులో స్విచ్‌బోర్డులు విద్యుత్ పరికరాలు అమర్చాలి.
- ఉరుములు, మెరుపులు, వర్షం కురిసే సమయంలో గృహోపకరణాలు, టీవీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు, ఏసీలు, కంప్యూటర్లు విద్యుత్ సరఫరా లేకుండా చూసుకోవాలి. ప్రమాదకరంగా ఉన్న వైర్లను వెంటనే తొలగించాలి.
- విద్యుదాఘాతానికి గురైతే వెంటనే మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి.
- వ్యవసాయ విద్యుత్ మోటర్లకు తప్పనిసరిగా ఎర్త్ ఉండేలా చూసుకోవాలి.
- పంపు సెట్లు వర్షంతో తడవకుండా కవర్లు కప్పి ఉంచాలి.
- పొలంలోని వ్యవసాయ విద్యుత్ మోటార్ తీగలు కింద బురదలో లేకుండా చూసుకోవాలి.
- విద్యుత్ మోటార్లను తడి చేతులతో తాకొద్దు.
- తీగలు తెగిపడిన విద్యుత్ సరఫరాపై అనుమానం వచ్చిన వేంటనే మరమ్మతులు చేయకుండా వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారమివ్వాలి.
- విద్యుత్ మోటార్లకు ఇనుప రేకులతో కాకుండా ప్లాస్టిక్ బాక్సులను అమర్చాలి.

పైన సూచించిన విధంగా వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చని విద్యుత్ అధికారులు సూచనలు, సలహాలు అందజేస్తున్నారు.

కార్మికులకు గ్రీన్‌ఛానల్ ద్వారా వేతనాలివ్వాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్



జీపీ కార్మికుల సమస్యలకై హైదరాబాద్ వెళ్తున్న కార్మికులను అరెస్ట్ చేసిన పోలీసులు

కొత్తకోట: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ అన్నారు. శుక్రవారం చలో హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం ధర్నాకు వెళ్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారంగా గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే నెల మొదటి రోజున గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, నేటికి అమలు కాకపోవడంతో జీపీ కార్మికులు ఆందోళన చెందుతున్నారని ఆయన తెలిపారు. జీఓ నంబర్ 60 ప్రకారం కేటగిరీల వారిగా వేతనాలను నిర్ణయించాలని, పంచాయతీ సిబ్బందిని రెండో పీఆర్‌ఎస్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. జీఓ నంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత కేటగిరీలను కొనసాగించాలని అర్హులైన సిబ్బందికి ప్రమోషన్లు కల్పించాలని, 60 సంవత్సరాలు వయస్సు పైబడిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని సూచించారు. అంతేకాకుండా ప్రమాదంలో మరణిస్తున్న కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రతి కార్మికుడికి ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జీపీ కార్మిక యూనియన్ మండల అధ్యక్షుడు ఎస్.భాస్కర్, ఉపాధ్యక్షుడు అశోక్, కార్యదర్శి ఎన్.రాములు, నాగేష్, రవి, శివ, సహదేవుడు, కృష్ణయ్య, సాయికుమార్, అంజి నిరంజన్, కమల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం

పాన్‌గల్: ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా రేమద్దుల గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గూన్యా వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిల్వ నీటిని వారానికి ఒక్కసారి పారబోస్తూ నూతన నీటిని పట్టుకోవాలన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు.



పాన్‌గల్ మండలం రేమద్దులలో నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

కార్యక్రమంలో సీహెచ్ఓ రామయ్య, వైద్య సిబ్బంది రాంచందర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'రైతునేస్తం' సద్వినియోగం చేసుకోవాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: రైతు వేదికల్లో నిర్వహించే రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. క్రాబ్ బుకింగ్ అనేది క్షేత్రస్థాయిలో వెళ్లి పకడ్బందీగా చేయాలని, రైతులను వరి పంట మాత్రమే కాకుండా పంట మార్పిడిపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం ద్వారా నిర్వహించే రైతునేస్తం వ్యవసాయ కార్యక్రమాన్ని జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని మండల వ్యవసాయ అధికారులు వ్యవసాయ విస్తీర్ణాధికారులతో ఖరీఫ్ సాగు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమం కేవలం వీక్షించడమే కాకుండా అక్కడ వచ్చిన రైతులతో మాట్లాడించాలని వ్యవసాయ అధికారులు సైతం రైతులతో మాట్లాడి వ్యవసాయ మెలకువలు అందజేయాలని సూచించారు. కేవలం వరి మాత్రమే సాగు చేయకుండా రైతులతో మాట్లాడి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మరలించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అ ధికారి గోవింద్ నాయక్, మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు, తదితరులు ఉన్నారు.

క్షయవ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు చేయాలి

జిల్లాలోని క్షయ, మధుమేహం వ్యాధిగ్రస్తుల వైద్యం, ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. వనపర్తి మెడికల్ హెల్త్ రికార్డు అనే యాప్‌లో వివరాలు ఏ విధంగా నమోదు చేయాలనే విషయాలపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

వనపర్తి రూరల్: శ్రీ రంగాపురం మండల కేంద్రంలో 3వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అక్షరాభ్యాస కార్యాక్రమం నిర్వహించినట్లు టీచర్ మంజులారాణి తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వినోద పాల్గొని చిన్నారులు దివ్య, విజితలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారంవల్ల కలిగే ప్రయోజనాలు గర్భిణులు, బాలింతలకు తెలిపారు. కార్యక్రమంలో ఆశావర్కర్ జ్యోతి, చిన్నారుల తల్లులు మానస, పరమేశ్వరి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కాల్వ ఆక్రమణపై ఫిర్యాదు

పాన్‌గల్: వ్యవసాయ పొలంలోని కాల్వను ఆక్రమించుకొన్న సంఘటనపై మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైనట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు. హెచ్‌సీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాగాపూర్ గ్రామానికి చెందిన మంగదొడ్డి సింగన్నకు చెందిన సర్వే నం.190, 191లో సుమారు 300 పీట్ల పొడువు, 5 పీట్ల వెడల్పు కలిగిన కాల్వ ఉన్నది. ఈ కాల్వను సమీప రైతు వంగూరి సుబ్బయ్య ఆక్రమించుకొని తన పొలంలో కలుపుకొని శిస్తు చేస్తున్నాడు. ఈ సంఘటనపై గతంలో 25–12–2023 ఫిర్యాదు చేసినా నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కాల్వ ఆక్రమణపై సమగ్ర విచారణ జరిపి కాల్వ నక్షను పరిశీలన చేసి, తన కాల్వ తనకు ఇప్పించాలని కోరుతూ మంగళవారం సింగన్న ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్‌కు ఘన సన్మానం

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని నర్సింగాయపల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్ రాకాసి అనసూయ రిటైర్డ్ కావడంతో శుక్రవారం అనసూయ దంపతులను కాంగ్రెస్ సమన్వయకర్త లక్కాకుల సతీష్, పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ చందర్ పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. విధి నిర్వాహణలో ఆమె చూపిన చొరవను గుర్తిస్తూ సన్మానించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పద్మ, పరశురాం, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు బీ.మన్నెంకొండ, నాయకులు శేఖర్ రెడ్డి, వడ్డే రాజు, నరేందర్, కురుమూర్తి, ఎల్లప్ప కుమార్, శివ, ఫహీంపాష, మహేష్, నరసింహ, శివ, బాలస్వామి, ఆంజనేయులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి

ఖిల్లాఘనపురం: విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిర్మలాయపల్లి, మొగులుకుంట తండా ప్రాథమిక పాఠశాలలు, కమాలొద్దీన్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలలను పరిశీలించారు. చదువులో కాస్త వెనకబడిన విద్యార్థులను తరగతి వారిగా గుర్తించి వారి పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించకుంటే ఆత్మహత్యే శరణ్యం

అమరచింత: మన ఊరు–మనబడి ద్వారా మంజూరైన డైనింగ్ హాల్ కిచెన్, బాత్రూంలు నిర్మించినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం చెల్లించలేదని, బిల్లులు ఇవ్వకుంటే ఆత్మహత్యే శరణ్యమని కాంట్రాక్టర్ రాముల శ్రీనివాసులు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తాను నిర్మించిన భవనాల ముందు కుటుంబ సభ్యులతో కలిసి నల్లబ్యాడ్జీలు దరించి నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని మస్తీపురం గ్రామానికి చెందిన రాముల శ్రీనివాసులు గతేడాది మన ఊరు–మన బడిలో భాగంగా గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, మరుగుదొడ్డి నిర్మాణాలకు రూ.18.50లక్షలు వెచ్చించారు. బిల్లులు ఇవ్వమని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించకపోతే తాను నిర్మించిన భవనాల ముందే కుటుంబంతో కలిసి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు

మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం

వనపర్తిటౌన్: వనపర్తి జిల్లా కేంద్రంలో పుర ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి రూ.44 కోట్లతో వనపర్తిలో సీసీ రోడ్ల పనులు వీధివీధినా చేయిస్తున్నారని కాంగ్రెస్ సమన్వయకర్త లక్కాకుల సతీష్, పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రామాలయం దారిలో సీసీరోడ్డు డ్యామేజ్ కావడంతో శుక్రవారం రామాలయం సమీపంలో దెబ్బతిన్న రోడ్డును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామాలయానికి వచ్చే భక్తులతో పాటుగా ఈ ప్రాంతం నుంచి రాకపోకలు సాగించే ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యేకు సూచిస్తామని తెలిపారు. కాంట్రాక్టర్‌ను క్షేత్రస్థాయికి పిలిచి రహదారి నిర్మాణం కోసం సంప్రదింపులు జరిపారు. కార్యక్రమంలో నాయకులు పరశురాం, నక్క రాములు, ప్రకాష్, వినోద్ గౌడ్, బాలరాజ్ గౌడ్, తిరుపతి, కార్తీక్, ఈశ్వర్ గౌడ్, శ్రీకాంత్, భూపేష్ గౌడ్, మహేష్ పాల్గొన్నారు.



దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

ఓట్ల కోసమే 'రైతుభరోసా'

గోపాల్‌పేట: ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా డబ్బులు వేస్తోందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆరోపించారు. శుక్రవారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మండలంలోని ఆముదాలకుంట తండాలో పర్యటించారు. రైతుల కష్టాలు గుర్తెరిగి బీఆర్‌ఎస్ పార్టీ రైతుబంధు పథకం ప్రవేశపెట్టి రైతులకు రూ.10వేలు ఎకరాకు అందిస్తే, ఆ పథకాన్ని కేవలం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకునేందుకు రైతుభరోసా అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ హామీలు ఒకసారి నమ్మి ప్రజలు మోసపోయారని మళ్లీ మోసపోవద్దని గుర్తుచేశారు. మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, మాజీ కో ఆప్షన్ మతీన్, మన్యం నాయక్, గోపాల్ పాల్గొన్నారు.



ఆముదాలకుంటలో ప్రజలతో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు బాల్‌రాజు

మూత్రశాలలు లేకపోవడం సిగ్గుచేటు

వనపర్తి రూరల్: వనపర్తి పట్టణంలో బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సరిపడ మూత్రశాలలు లేకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సాయిలీల మండిపడ్డారు. శుక్రవారం మహిళా కళాశాలలో పరిసరాలను ఆమె పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఈ కళాశాలలో 650 మంది మహిళా విద్యార్థులు ఉండగా, వారికి కేవలం 3 మూత్రశాలలు మాత్రమే ఉన్నాయన్నారు. ఇది వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని మండిపడ్డారు. కలెక్టర్ స్పందించి కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కవిత, రేణుక, శ్యామల, విద్యార్థినులు పాల్గొన్నారు.


పట్టణాభివృద్ధికి కలిసికట్టుగా కృషి

వనపర్తిటౌన్: నిల్వ నీటిని వాడితే అనారోగ్యం బారిన పడతారని, నిల్వ నీటిని వాడకుండా ఎప్పటికప్పుడు ట్యాంక్‌లు, డ్రమ్ములు, హౌజులు, బిందెలను శుభ్రం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని 2,3,18,17,7,33,15,8,9,32,22వ, వార్డుల్లో 100 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం ఫ్రైడే–డ్రైడే నిర్వహించారు.

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు కలిసికట్టుగా పట్టణాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కమిషనర్ చికినే శశి ధర్ అన్నారు. 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారుశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణబాయ్, మహేశ్వరి, పాల్గొన్నారు.

అమరచింత: పరిసరాల పరిశుభ్రతతో ప్రజలు ఆరోగ్యకరమైన జీవితం పొందుతారని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు.



పారుశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్

డీవీ కృష్ణకు ఘన నివాళి

అమరచింత: భారత విప్లవ యోధుడు, ఆదర్శ కమ్యూనిస్ట్, కార్మిక ఉద్యమ నేత, సోషలిజం స్వాప్నికుడు డీవీ.కృష్ణకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.కృష్ణ మాట్లాడుతూ డీవీ.కృష్ణ విప్లవోద్యమ నిర్మాత అని, తాను మరణించే వరకు విప్లవ రాజకీయాలవృద్ధి కోసం పరితపించిన వ్యక్తి అని కొనియాడారు. మరణం వెంటాడుతున్నా కమ్యూనిస్ట్ రచనలను సాగించి ప్రజల నేతగా, మారుతున్న కాలానుగుణంగా భారత విప్లవపంథాకు తుది మెరుగులు దిద్దిన ఉద్దాండుడన్నారు. కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం, మాస్‌లైన్ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి సీహెచ్.రాంచందర్, జిల్లా నాయకులు అరుణ్ కుమార్, హనుమంతు, వెంకటేష్, సాంబ శివుడు, ప్రసాద్, గణేష్, రాజు, రాజన్న, మస్లామని, కురుమన్న, ప్రేమరత్నం, సామేలు, సీతారం, గీతబాయి, సుశీలమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కృష్ణ

బాలికలు చదువుపైనే దృష్టి సారించాలి

పాన్‌గల్: కస్తూర్బా విద్యాలయంలో చదువుతున్న బాలికలు ప్రభుత్వం కల్పించిన వసతులను సద్వినియోగం చేసుకుంటూ చదువుపైనే దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం సాయంకాలం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం బాలికలు, ఉపాధ్యాయ బృందంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హాస్టల్స్‌లో ఉండటం బాలికలకు ఒక సువర్ణ అవకాశమని, ఇక్కడ తోటి బాలికలతో సహజీవనం, సర్దుబాటు, భిన్నమైన సంస్కృతులను నేర్చుకోవడం సాధ్యమవుతుందన్నారు. ఇబ్బందిక పరిస్థితులు ఎదురైనప్పుడు ఇక్కడ స్థానికంగా ఉండే ఎస్ఓ, బోధన సిబ్బందికి, అసరమైతే మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకరావాలన్నారు. నూతనంగా విద్యాలయంలో చేరిన బాలికలను సీనియర్స్ అక్కున చేర్చుకొని ఒంటరితనం అనే భావన లేకుండా చూసుకోవాలన్నారు. విద్యాలయంలో బోధన సిబ్బంది నుంచి ఒక కౌన్సిలర్‌ను ఏర్పాటు చేస్తూ ఏదైనా సమస్య ఉంటే బాలికలు కౌన్సిలర్ దృష్టికి తీసుకరావాలని సూచించారు. సమావేశంలో ఎస్ఓ హేమలత, ఉపాధ్యాయ బృందం, బాలికలు పాల్గొన్నారు.



పాన్‌గల్ కస్తూర్బా విద్యాలయం బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

ప్రజా సంఘాల నేతల బైండోవర్

వీపనగండ్ల: విద్యాధికారుల అనుమతులు తీసుకోకుండా పాఠశాల విద్యార్థులను తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేసేందుకు తీసుకెళ్లిన పలు ప్రజాసంఘాల నాయకులను శుక్రవారం పోలీసులు తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. ఆ మండలంలో పలువురు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై జిల్లా కేంద్రానికి పంపించడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, సీపీఎం, పలు ప్రజా సంఘాల నాయకులు ఈ నెల 23న తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అనుమతి తీసుకోకుండా విద్యార్థులను నిరసన కార్యక్రమానికి తీసుకెళ్లడంపై కలెక్టర్ ఆదేశాల మేరకు పలువురిని బైండోవర్ చేశారు.

ఉపాధ్యాయులను నియమించమంటే బైండోవర్ చేస్తారా?

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ బోధించేందుకు ఉన్న ఒక్క టీచర్‌ను, మరొక టీచర్‌ను విద్యాధికారులు డిప్యూటేషన్ పై పంపించడం వల్ల విద్యార్థులు నష్టపోతారన్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసన తెలియజేశామని, చదవులు చెప్పించమని కోరితే బైండోవర్ చేయించడం అన్యాయమని ప్రజా సంఘాల నాయకులు ఆశన్న, ఈశ్వర్, వెంకటేశ్వర్లగౌడ్, రామకృష్ణ, నవీన్‌లు అన్నారు. వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.



ప్రజా సంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మాస్టర్ మైండ్స్ పాఠశాలను సీజ్ చేయాలి

వనపర్తి రూరల్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పెబ్బేరు మన్సిపాలిటీలోని మాస్టర్ మైండ్స్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని, ఆ పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని ఏబీవీపీ మండల శాఖ ఆధ్వర్యంలో పాఠశాల దగ్గర ధర్నా నిర్వహిం చారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈఓ జయరాములు పాఠశాల దగ్గరకు చేరుకొని పుస్తకాల నిల్వ ఉన్న షట్టర్‌ను సీజ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివకుమార్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ కార్తీక్ పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాలు అందజేత

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని బునాదిపురం గ్రామంలోని యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన మల్లేష్‌యాదవ్ శుక్రవారం నోట్ బుక్కులు, పెన్సిళ్లు, పెన్నులు, స్టడీమెటీరియల్ అందజేశారు. ఎచ్ఎం నాగేష్, ఉపాధ్యాయులు దయానందు, వెంకటేష్‌సాగర్, నరేందర్ పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండాలి

మదనాపురం: మండలంలోని దంతనూరులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి డా భవాని ఆధ్వర్యంలో ఏఎంఓ ఏఎల్ఓ టీం సభ్యులు గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అస్సిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

తండ్రీకొడుకులకు సత్కారం

అమరచింత: వయస్సులో తేడా ఉన్న తండ్రీకొడుకు ఒకేసారి లాసెట్ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని పట్టణానికి చెందిన యువకులు వారిని శుక్రవారం ఘనంగా సత్కరించారు. పట్టణానికి చెందిన కావలి విజయ్, సంపత్ కుమార్‌లు లాసెట్ పరీక్షలకు హాజరయ్యారు. ఒకేసారి ఇద్దరు ఉత్తీర్ణత సాధించారు. పట్టణానికి చెందిన యువకులు షాలువాతో వారిని సన్మానించారు.